క్లుప్తంగా

పారిశుద్ధ్య కార్మికుల ధర్నాలు



ఆర్ఆర్‌పేటలోని మస్తర్ పాయింట్ వద్ద ధర్నా చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

ఏలూరు (టూటౌన్): మున్సిపల్ కార్మికులకు తక్షణమే 12వ పీఆర్సీ ప్రకటించాలని, మధ్యంతర భృతి (ఐఆర్) ఇవ్వాలని, గతేడాది సమ్మె కాలపు ఒప్పందాల అమలుకు జీఓలు ఇవ్వాలని, ఇంజినీరింగ్ కార్మికుల జీతాలు పెంపుదల చేయాలని కోరుతూ గురువారం మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులు ఏలూరు నగరపాలక సంస్థ పరిధిలోని వివిధ శానిటరీ సర్కిళ్లలో ధర్నాలు నిర్వహించారు. కార్యక్రమాల్లో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి డీఎన్‌వీడీ ప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షుడు బి.సోమయ్య, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నగర అధ్యక్షుడు లావేటి కృష్ణారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.జాన్‌బాబు, ఆటో డ్రైవర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జె.గోపిలు పాల్గొని మాట్లాడారు. మున్సిపల్ ఉద్యోగుల, కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. లేకుంటే జనవరి 3, 10న కూడా ఆందోళనలు చేస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమాలకు బంగారు వెంకటేశ్వరరావు, పి.విష్ణు, కాళిదాసు, కాంతమ్మ, నాగమణి, సత్యవతి, లక్ష్మి, నాగరాజు, ప్రదీప్, ప్రసాదు తదితరులు నాయకత్వం వహించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక అశోక్ నగర్ సబ్ స్టేషన్ పరిధిలోని ఆర్‌టీసీ ఫీడర్‌కు చెట్ల కొమ్మలు తొలగింపు, లైన్ల వార్షిక మరమ్మతుల నిమిత్తం శుక్రవారం ఉదయం 7 నుంచి 11 గంటల వరకు నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈఈ కేఎం అంబేద్కర్ తెలిపారు. అశోక్ నగర్, అమీనాపేట, కలెక్టర్ ఆఫీసు ప్రాంతం, ఏటిగట్టు ప్రాంతం, కొత్త బస్టాండ్ ప్రాంతం, ఆర్‌వీ రామారావు వీధి, హోటల్ గ్రాండ్ ఆర్య రోడ్డు, డాక్టర్ జగన్‌మోహన్ రావు వీధి ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

నేడు సోషల్ ఆడిట్ గ్రామ సభలు

దెందులూరు: మండలంలోని మూడు గ్రామాల్లో శుక్రవారం జాతీయ ఉపాధి హామీ పథకం గ్రామ స్థాయి సోషల్ ఆడిట్ సభలు నిర్వహించనున్నట్లు ఉపాధి హామీ పథకం టెక్నికల్ అసిస్టెంట్లు ఫాతిమా శ్రావణ్ తెలిపారు. ఉదయం 10 గంటలకు జోగన్నపాలెం, 12 గంటలకు సానిగూడెం, మధ్యాహ్నం 2 గంటలకు శ్రీరామవరంలో సభలు నిర్వహిస్తామని, ప్రజలు హాజరుకావాలని కోరారు.

సామాన్యులకు 'కూటమి' షాక్

- నెలనెలకూ పెరుగుతున్న విద్యుత్ బిల్లులు
- రెండు నెలల్లో యూనిట్‌కు 65 పైసల పెంపు
- ప్రజల గగ్గోలు



అశోక్ నగర్ విద్యుత్ సబ్ స్టేషన్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రజలను ఫూల్స్‌ని చేసింది. సమక్షేమాన్ని విస్మరించింది. పథకాల అమలుపై నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తోంది. ఇందులో భాగంగానే విద్యుత్ చార్జీలను పెంచింది. కూటమి పార్టీ అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచబోమని ఎన్నికల ప్రచారం సభల్లో చంద్రబాబు, లోకేష్, పవన్ కళ్యాణ్‌లు ఊదరగొట్టారు. అవకాశం ఉంటే తగ్గిస్తామని కూడా హామీ ఇచ్చారు. వారు అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే రెండుసార్లు విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై భారం మోపింది. ఇప్పటికే అన్ని నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరగగా, కూరగాయల ధరలు నానాటికీ పెరుగుతునే ఉన్నాయి. తాజాగా ప్రతి నెలా పెరుగుతునే ఉన్న విద్యుత్ బిల్లులు చెల్లించలేక సామాన్యులు గగ్గోలు పెడుతున్నారు.

నెలకు రూ.2.66 లక్షల భారం

ఏలూరు నియోజకవర్గంలో గృహాలకు సంబంధించి అక్టోబర్ నెలలో మొత్తం 1,38,747 సర్వీసుల ద్వారా 2,65,43,544 యూనిట్లు వినియోగించడంతో రూ.17,06,82,000 బిల్లులు వచ్చాయి. నవంబర్ నెలలో 1,38,892 సర్వీసులకు 2,64,69,197 యూనిట్లు వినియోగించగా రూ.17,09,48,000 బిల్లులు వచ్చాయి. అంటే నియోజకవర్గ ప్రజలపై ఒక్క నెలలోనే రూ.2.66 లక్షల భారం పెరిగింది. వచ్చే వేసవిలో బిల్లులకు మరింతగా రెక్కలు వచ్చే పరిస్థితి నెలకొందని వినియోగదారులు వాపోతున్నారు.

నెలనెలా యూనిట్ చార్జీల పెంపు

ఏలూరు నియోజకవర్గంలో అక్టోబర్, నవంబర్ నెలల్లో వచ్చిన యూనిట్ల వినియోగాన్ని పరిశీలిస్తే ఒక్కో యూనిట్‌పై 65 పైసలు అదనంగా బిల్లులు వేసినట్టు తెలుస్తుంది. వైఎస్సార్ సీపీ హయాంలో విద్యుత్ కొనుగోలు ఇంధన చార్జీలను బిల్లుల్లో వేయకుండా ప్రభుత్వమే భరించేలా నిర్ణయం తీసుకోవడంతో వినియోగదారులపై పెద్దగా భారం పడలేదు. కానీ కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఇంధన, విద్యుత్ కొనుగోలు, విద్యుత్ చార్జీలను కలిపి విధించడంతో విద్యుత్ బిల్లులు సామాన్యుడు భరించలేనంతగా పెరిగాయి. గతంలో కేవలం రూ.300 నుంచి రూ.400 బిల్లులు వస్తే నేటి కూటమి ప్రభుత్వంలో బిల్లులు రెట్టింపు మొత్తంలో వస్తున్నాయని ప్రజలు గగ్గోలు పెడుతున్నారు.

ఉచితానికీ కొర్రీలు

ఎస్సీ, ఎస్టీలకు ఇచ్చే ఉచిత విద్యుత్‌లో కూడా కొర్రీలు పెట్టడానికి కూడా కూటమి ప్రభుత్వం వెనకాడడం లేదు. ఇప్పటి వరకు నెలకు 200 యూనిట్ల వరకు విద్యుత్ వినియోగించుకుంటే ఆయా వర్గాలకు ఉచితమే. తాజాగా కూటమి ప్రభుత్వం ఆ నిబంధన అలాగే ఉంచినా, బిల్లులను ఆలస్యంగా తీసేలా మీటర్ రీడర్లకు ఆదేశాలు జారీ చేస్తుంది. రీడింగ్ ఆలస్యంగా తీస్తుండడంతో వారికి 200 యూనిట్లకు పైబడి వినియోగం వస్తుంది. ఐతే ఉచితమని ప్రకటించిన 200 యూనిట్లను మినహాయించి మిగిలిన యూనిట్లకు బిల్లులు జారీ చేయాల్సి ఉండగా ప్రభుత్వం మొత్తం వినియోగించిన యూనిట్లకు బిల్లులు వేస్తూ అడ్డగోలు దోపిడీకి పాల్పడుతోంది.

పెంచిన చార్జీలు వెనక్కి తీసుకోవాలి



కూటమి ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలు సామాన్యులకు భారంగా పరిణమించాయి. ప్రభుత్వం మరోసారి ప్రజలను మోసం చేసింది. అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన హామీలను అమలు చేయకపోవడం సిగ్గుమాలిన పని. ఈ పెంచిన చార్జీలను బేషరతుగా వెనక్కి తీసుకోవాలి.

– గనిగంటి కోటేశ్వరరావు, ఏలూరు రూరల్

ట్రూ అప్ చార్జీలు రద్దు చేయాలి



విద్యుత్ బిల్లులపై విధించిన ట్రూ అప్ చార్జీలను వెంటనే రద్దు చేయాలి. ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసం ఆలోచించాలి. వారిపై భారాలను తగ్గించడానికి కృషి చేస్తేనే ప్రజా ప్రభుత్వమౌతుంది. దొడ్డిదారిన ధరలు పెంచి ముక్కు పిండి వసూలు చేయడం ప్రజల్లో వ్యతిరేకత నింపుతుంది.

– జె.గోపి, ఏలూరు

ఏజెన్సీ భూ సమస్యలపై వినతి



డీఆర్వోకు వినతిపత్రం అందిస్తున్న సీపీఎం నాయకులు

ఏలూరు (టూటౌన్): ఏజెన్సీ భూ సమస్యలు పరిష్కరించాలని, రెవెన్యూ అధికారుల తప్పుడు ప్రొటెక్షన్ ఆర్డర్లపై సమగ్ర విచారణ చేయించాలని, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ సీపీఎం జిల్లా కమిటీ బృందం గురువారం డీఆర్ఓ విశ్వేశ్వరరావుకు వినతి పత్రం అందజేసింది. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ గిరిజన చట్టాలకు లోబడి రెవెన్యూ శాఖ అధికారులు భూ సమస్యలను పరిష్కరించాలని కోరారు. గిరిజనులు తమ భూములు, హక్కుల కోసం చేస్తున్న పోరాటాలపై కొందరు పోలీసు అధికారులు, గిరిజనేతరులతో కుమ్మక్కై అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఆరోపించారు. బుట్టాయగూడెం, జీలుగుమిల్లి మండలంలోని పలు గ్రామాల్లో కోర్టు ఆర్డర్లున్నా గిరిజనులపై అక్రమ కేసులు పెట్టిన సందర్భాలు అనేకం ఉన్నట్టు చెప్పారు. గిరిజనుల సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని డీఆర్ఓకి అందించారు. కార్యక్రమంలో సీపీఎం కార్యదర్శి వర్గసభ్యుడు కె.శ్రీనివాస్, పి.రామకృష్ణ పాల్గొన్నారు.

స్వాతంత్ర్య పోరాటంలో సీపీఐ పాత్ర కీలకం



సీపీఐ శత వార్షికోత్సవాల ప్రారంభంలో పాల్గొన్న సీపీఐ శ్రేణులు

ఏలూరు (టూటౌన్): స్వాతంత్ర్య పోరాటంలో కమ్యూనిస్టు పార్టీ కీలకపాత్ర పోషించిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డేగా ప్రభాకర్ పేర్కొన్నారు. సీపీఐ శత వార్షికోత్సవాల సందర్భాన్ని పురస్కరించుకొని స్థానిక సీపీఐ ఏలూరు జిల్లా కార్యాలయం స్ఫూర్తి భవనం వద్ద ఆయన సీపీఐ పతాకాన్ని ఆవిష్కరించి, వేడుకలను ప్రారంభించారు. స్వాతంత్ర్య సాధనకు అవిశ్రాంత కృషి చేసిన పార్టీ సీపీఐ అని ప్రభాకర్ కొనియాడారు. సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఎన్నో త్యాగాల ఫలితంగా సాధించుకున్న హక్కులను గత 11 సంవత్సరాల కాలంలో కేంద్రంలో ఉన్న మోదీ ప్రభుత్వం కాలరాస్తోందని విమర్శించారు. ప్రజా సమస్యల పట్ల నిర్లక్ష్యం వహిస్తుందని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, ఏలూరు ఏరియా కార్యదర్శి ఉప్పులూరి హేమ శంకర్, జిల్లా కార్యవర్గ సభ్యులు పుప్పాల కన్నబాబు, కొండేటి బేబి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాస్ డాంగే, నగర అధ్యక్షుడు కె.కృష్ణమాచార్యులు, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ యామిని తదితరులు పాల్గొన్నారు.

ప్రజలపై విద్యుత్ చార్జీల భారం తగదు



విద్యుత్ చార్జీలపై నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

ఏలూరు (టూటౌన్): ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను సీఎం చంద్రబాబు తుంగలోకి తొక్కి ప్రజలపై విద్యుత్ భారాలను మోపడం తగదని సీపీఎం నాయకులు విమర్శించారు. ఈ మేరకు స్థానిక పడమర వీధిలో గురువారం ధర్నా చేశారు. కరెంటు చార్జీల బాదుడు, ట్రూ అప్ చార్జీల బాదుడంటూ నినదించారు. ఈ ధర్నాను ఉద్దేశించి సీపీఎం ఏలూరు నగర కార్యదర్శి డీఎన్‌వీడీ ప్రసాద్, నగర నాయకులు వైఎస్ కనకారావు మాట్లాడారు. తాము అధికారంలోకి వస్తే కరెంటు చార్జీలు పెంచబోమని, స్మార్ట్ మీటర్లను నిలిపివేస్తామని హామీ ఇచ్చిన కూటమి నాయకులు అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే ప్రజలపై రూ.17 వేల కోట్ల భారాన్ని ట్రూ అప్ చార్జీల పేరిట మోపారని విమర్శించారు. స్మార్ట్ మీటర్లను రద్దు చేస్తామన్న నారా లోకేష్ హామీ ఏమైందని ప్రశ్నించారు. అదానీతో జరిగిన ఒప్పందాలను రద్దు చేయాలని, అవినీతి కుంభకోణాలపై విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. ధర్నాలో జె.గోపి, గనిగంటి కోటేశ్వరరావు, దువ్వాడ దుర్యోధన, సీహెచ్ అన్నవరం మండూరు శ్రీనివాసరావు, జంగం చంద్రశేఖర్, చెన్నూరి రమేష్, రామరాజు, ఆర్ నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

బడేటి బుజ్జి విగ్రహావిష్కరణ



బుజ్జి విగ్రహావిష్కరణలో పాల్గొన్న మంత్రులు, ఎమ్మెల్యేలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): మాజీ ఎమ్మెల్యే దివంగత బడేటి కోట రామారావు (బుజ్జి) 5వ వర్ధంతి సందర్భంగా గురువారం స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయం వద్ద బుజ్జి కాంస్య విగ్రహాన్ని మంత్రులు కొలుసు పార్థసారథి, నిమ్మల రామానాయుడు, ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ ఆవిష్కరించారు. ప్రస్తుత ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి) ఆధ్వర్యంలో బుజ్జి విగ్రహాన్ని ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో ఉంగుటూరు, దెందులూరు, చింతలపూడి ఎమ్మెల్యేలు, తదితరులు పాల్గొన్నారు.

సమీక్షా సమావేశం

ఏలూరు(మెట్రో): స్థానిక జెడ్పీ క్యాంపు కార్యాలయంలో గురువారం జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ పెదపాడు ఎంఈఓలతో సమీక్ష నిర్వహించారు. పదో తరగతి విద్యార్థుల 100 రోజుల యాక్షన్ ప్లాన్‌పై సమీక్షించి, నూరుశాతం ఉత్తీర్ణతకు కృషి చేయాలని సూచించారు.

బాదంపూడిలో ఇళ్ల తొలగింపు



ఇళ్లను కూల్చుతున్న పొక్లెయిన్

ఉంగుటూరు: బాదంపూడి గ్రామంలో ఇరిగేషన్ కాల్వ గట్లపై ఉన్న 8 ఇళ్లలో ఐదిళ్లను గురువారం తొలగించారు. ఎంపీడీఓ రాజ్‌మనోజ్ పర్యవేక్షణలో ఈవోపీఆర్డీ చంద్రశేఖర్, ఈఓ రవికుమార్‌లు పొక్లెయిన్ల సాయంతో ఇళ్లను తొలగించారు.

విష్ణు ఆలయంలో దీపారాధన



స్వామివారికి దీపారాధన చేస్తున్న యువత

దెందులూరు : ధనుర్మాస పూజల్లో భాగంగా స్థానిక విష్ణు ఆలయంలో గురువారం మహిళలు స్వామివారికి వివిధ రకాల పుష్పాలతో విశిష్ట అలంకరణ చేశారు. దీపారాధన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు భక్తులకు స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

హుండీ లెక్కింపు

జంగారెడ్డిగూడెం: పారిజాతగిరి వేంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో ధనుర్మాసోత్సవాల్లో భాగంగా గురువారం వేకువ జామున తిరుప్పావై ప్రవచనం నిర్వహించారు. ఉదయం 9 గంటలకు హుండీ లెక్కింపుకు ధర్మాదాయ శాఖ ఏలూరు ఇన్‌స్పెక్టర్ వి.సురేష్‌కుమార్, ఆలయ కార్య నిర్వాహణాధికారి మానికల రాంబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. 90 రోజులకు రూ.9,54,726 ఆదాయం వచ్చినట్టు కార్య నిర్వహణ అధికారి తెలిపారు.

సగం నిధుల ఖర్చుకే అవకాశం

- ఎట్టకేలకు వినియోగంపై క్లారిటీ
- నియోజకవర్గంలో 195 స్కూల్స్‌కు రూ.27.62 లక్షల నిధులు
- నిధుల పర్యవేక్షణకు పీఎంశ్రీ యాప్



జల్లికొమ్మర యూపీ స్కూల్లో బీరువా మరామత్తులు చేస్తున్న సిబ్బంది

నిడమర్రు: ప్రభుత్వ పాఠశాలల్లో కనీస వసతుల కల్పన, స్వచ్ఛ కార్యక్రమాల అమలు, అవసరమైన సామగ్రి కొనుగోలు నిమిత్తం స్కూల్ వార్షిక గ్రాంట్‌లో 50 శాతం వరకు ఖర్చు చేసుకునే అవకాశం కల్పించారు. ఈ మేరకు విద్యాశాఖ మార్గదర్శకాలు జారీ చేసింది. ఈ నిధుల వినియోగం పర్యవేక్షణకు పీఎంశ్రీ అనే మరో కొత్త యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఉంగుటూరు నియోజకవర్గంలోని స్కూళ్ల హెచ్‌ఎంలు ప్రతి పాదనలను నవంబరు నెలలో ఆన్‌లైన్ చేశారు. అప్పట్లోనే ప్రతిపాదించిన నిధుల్లో 50 శాతం ఆయా స్కూల్స్ పీఎఫ్ఎంఎస్ ఖాతాల్లోకి అధికారులు జమ చేశారు. వీటి వినియోగంపై అవగాహన లేక అవి ఖాతాల్లోనే మూలుగుతున్నాయి.

ప్రతిపాదనల్లో 50 శాతమే మంజూరు

ఉంగుటూరు నియోజకవర్గంలోని 195 ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ నిమిత్తం నవంబరు నెలలో రూ.55.25 లక్షలకు హెచ్‌ఎంలు ప్రతిపాదనలు ఆన్‌లైన్ చేశారు. వీటిలో 50 శాతం రూ. 27,62,500 నిధులు మంజూరు చేశారు. ఈ మేరకు పీఎఫ్ఎంఎస్ ఖాతాల్లోకి సమగ్ర శిక్ష ద్వారా నిధులు జమ చేశారు. 2024 ఏప్రిల్ నుంచి 2025 మార్చి వరకు పాఠశాల స్థాయిలో చేసిన ఖర్చుల బిల్లులను పీఎంశ్రీ యాప్‌లో అప్‌లోడ్ చేసి పీఎఫ్ఎంఎస్ ఖాతా నుంచి డ్రా చేసుకునే అవకాశం కల్పించారు. సాధారణంగా ప్రతి విద్యా సంవత్సరం ఆరంభంలోనే ఈ గ్రాంట్స్ విడుదలయ్యేవి. ఈ నిధులను విద్యాశాఖ సూచించిన మార్గదర్శకాలకు అనుగుణంగా పాఠశాల నిర్వహణ కమిటీఈ తీర్మానం చేసి ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఈ ఖర్చు చేసిన ప్రతి బిల్లుకూ 2025 మార్చి తర్వాత ఆడిట్ ఉంటుందని అధికారులు తెలిపారు.

మండలం	స్కూల్స్	మంజూరైన నిధులు రూ.ల్లో
భీమడోలు	35	4,87,500
ఉంగుటూరు	65	9,47,500
నిడమర్రు	40	6,45,000
గణపవరం	55	6,82,500
మొత్తం	195	27,62,500

2022–23 రోల్ ఆధారంగా కేటాయింపులు

ఈ నిధులను 2022–23 పాఠశాలల్లో విద్యార్థుల నమోదు ఆధారంగా ప్రభుత్వం స్కూల్ గ్రాంట్ విడుదల చేసింది. రోల్ 1 నుంచి 30 వరకు రూ.10 వేలు, రోల్ 31 నుంచి 100 వరకు రూ.25 వేలు, 101 నుంచి 250 వరకు రూ.50 వేలు, 251 నుంచి 1000 వరకు రూ.75 వేలు, వెయ్యికి పైగా విద్యార్థులుంటే రూ.1 లక్ష నిధులు ఖర్చు చేసుకునే అవకాశం కల్పించారు. ప్రస్తుతం ఆయా నిధుల్లో 50 శాతం మాత్రమే ఖర్చుకు వెసులుబాటు ఇచ్చారు.

పీఎంశ్రీపై అవగాహన కల్పించాం



రోల్ ఆధారంగా విద్యాశాఖ పాఠశాల నిర్వహణ నిధులను ఆయా స్కూల్స్ పీఎఫ్ఎంఎస్ ఖాతాల్లోని నేరుగా జమ చేసింది. ప్రతిపాదించిన నిధుల్లో 50 శాతం మంజూరు చేశారు. ఈ నిధులను 2025 మార్చి లోపు పాఠశాలలకు అవసరమైన అంశాలను ఎస్ఎంసీ తీర్మానం చేసి వినియోగించుకోవచ్చు. ప్రతి బిల్లు ఆన్‌లైన్ తప్పనిసరిగా చేయాలి. ఇందుకోసం రూపొందించిన పీఎంశ్రీ యాప్‌పై హెచ్‌ఎంలందరికీ అవగాహన కల్పించాము.

– ఏవీఎస్ఎన్ భాస్కర్‌కుమార్, ఎంఈఓ–2, నిడమర్రు

ముమ్మరంగా రబీ వరి నాట్లు




అంబర్‌పేట ఏరియాలో వరి నాట్లు వేస్తున్న బెంగాలీ కూలీలు

భీమడోలు: ఖరీఫ్ సాగు నష్టాలను మిగిల్చింది. ఆ నష్టాల నుంచి రబీ పంట గట్టెక్కిస్తుందన్న ఆశతో రైతాంగం సాగు పనుల్లో సమాయత్తమయ్యారు. ఇప్పటికే అప్పుల పాలైన రైతులు దాళ్వా సాగుపై ఆశతో మరోసారి అప్పులకు ఉపక్రమించారు. సార్వా ధాన్యం వర్షాలకు తడిచిపోవడంతో 10 రోజులకు పైగా రోడ్లపై రైతులు ఆరబెట్టారు. ఐనా తేమశాతం తగ్గకపోవడంతో రైతులు అయినకాడికి ధాన్యాన్ని దళారులకు అమ్ముకున్నారు. కూటమి ప్రభుత్వం పెట్టుబడి సాయం అందిస్తుందన్న రైతుల ఆశలు ఆడియాలయ్యాయి.

సాగు విస్తీర్ణం 12824 ఎకరాలు

భీమడోలు మండలం పాక్షిక మెట్ట మండలం. దాళ్వాలో 12,824 ఎకరాల సాగు విస్తీర్ణం కాగా ఇప్పటికే 641 ఎకరాల్లో నారుమడులు వేయాల్సి ఉండగా 632 ఎకరాల్లో నారుమడులు పూర్తి చేశారు. గ్రామాల్లో వరినాట్లు ముమ్మరంగా చేపట్టారు. బెంగాలీ కూలీలచే వరి నాట్లు వేస్తున్నారు. ప్రస్తుతానికి 1500 ఎకరాల్లో వరి నాట్లు పూర్తిచేశారు. మెట్ట గ్రామాలైన కోడూరుపాడు, దుద్దేపూడి, పోలసానిపల్లి, అంబర్‌పేట తదితర గ్రామాల్లో వరి నాట్లు 40 శాతం పూర్తయ్యాయి. మిగిలిన డెల్టా గ్రామాల్లో వరి నాట్లు జనవరి చివరి నాటికి పూర్తికానున్నాయి. అయితే సార్వా కన్నా దాళ్వాలో పెట్టుబడి ఎక్కువ అవుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎక్కువగా పీఆర్ 126, ఎంటీయు 1121 వరి వంగడాలను సాగు చేస్తున్నారు. వీటి పంట కాలం 120 నుంచి 130 రోజులు కావడంతో రైతులు వాటిపైనే మక్కువ చూపుతున్నారు. ఏప్రిల్ నెలాఖరు నాటికి పంట చేతికందేలా వ్యవసాయ శాఖ తగు కార్యాచరణ చేపట్టింది.



గుండుగొలను ప్రాంతంలో నారు తీస్తున్న కూలీలు

భూ సమస్యల పరిష్కారానికి కృషి



అధికారులకు సమస్యలు వివరిస్తున్న రైతులు

భీమడోలు: భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తుందని మండల ప్రత్యేకాధికారి ఆర్‌వీ నాగరాణి అన్నారు. పోలసానిపల్లి గ్రామంలో గురువారం సర్పంచ్ షేక్ రహీమాబేగం అధ్యక్షతన రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా నాగరాణి మాట్లాడుతూ సమస్యలపై 8 అర్జీలు వచ్చాయని, వీటిని గడువు తేదీలోగా పరిష్కరిస్తామని చెప్పారు. అనంతరం వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలను దరఖాస్తుదారులకు అందించారు. కార్యక్రమంలో తహసీల్దార్ బి.రమాదేవి, ఆర్ఐ కిరణకుమారి, సర్వేయర్ ధర్మారావు, గ్రామ కార్యదర్శి యు.జయరామకృష్ణ, వీఆర్వో సాల్మన్ పాల్గొన్నారు.

వెల్లమిల్లిలో ఐదు అర్జీలు

ఉంగుటూరు: వెల్లమిల్లి గ్రామంలో గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో వివిధ సమస్యలపై ఐదు అర్జీలు వచ్చినట్టు తహసీల్దార్ పూర్ణచంద్ర ప్రసాదు తెలిపారు. సర్పంచ్ కుమార్ రాజా, వీఆర్ఓలు పాల్గొన్నారు. శుక్రవారం ఉదయం బొమ్మిడిలో సదస్సు నిర్వహించనున్నారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	28
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	35
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్)	22.30	10
ఏలూరు – తిరుపతి(ఇంద్ర)	19.00	34

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు – బీహెచ్‌ఈఎల్	21.45	4820	20
ఏలూరు – బీహెచ్‌ఈఎల్	21.15	4822	25
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	29
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	25
ఏలూరు–జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	23
ఏలూరు–బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	21
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	29
ఏలూరు – ఈసీఐఎల్	22.30	4814	20
ఏలూరు – తిరుపతి	16.00	4830	33

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	20	అరటి కాయ (1)	06–08
వంకాయలు (గులాబీ)	30	చిక్కుడు కాయలు	48
వంకాయలు (కాంతులు)	48	బీన్లచిక్కుడు	68
వంకాయలు (తెలుపు)	44	చామదుంపలు	44
బెండకాయలు	28	ములక్కాడలు	10, 15
పచ్చిమిర్చి	32–36	కంద	60
కాకర కాయలు	34–44	బీట్‌రూట్	52
బీరకాయలు	34	కీరా దోస	40
బీరకాయలు (పందిరి)	48	ఫ్రెంచ్‌బీన్స్	84
క్యాబేజీ	28	అల్లం	70
క్యారెట్	48	కొత్తిమీర (కట్ట)	15
దొండకాయలు	52	పాలకూర	10
బంగాళదుంపలు	30–36	చుక్కకూర	10
ఉల్లిపాయలు	42	తోటకూర	10
గోరుచిక్కుడు	34	గోంగూర	07
దోసకాయలు	30	పుదీనా	05
ఆనబకాయ (1)	20–25	క్యాప్సికమ్	74
పొట్లకాయ(1)	20–25	చిలకడదుంప	36